EVENING EDITION
నేటి దినపత్రిక
సూర్య
www.suryaa.com
4PM
www.suryaa.com
శనివారం
08-11-2025
పేజీలు: 02




## ఆయన సమ్‌థింగ్ స్పెషల్.. వివేక్ రామస్వామిపై

# ట్రంప్ ప్రశంసలు




అగ్రరాజ్యం అమెరికాలో అధికార రిపబ్లికన్‌కు గట్టి షాక్ తగిలిన విషయం తెలిసిందే. ఇటీవలే అక్కడ జరిగిన పలు ఎన్నికల్లో భారత సంతతికి చెందిన డెమోక్రాట్లు గెలుపొందారు. ప్రతిష్టాత్మకంగా భావించే న్యూయార్క్ నగర మేయర్ ఎన్నికల్లోనూ భారత సంతతికి చెందిన జోహ్రాన్ మమ్దానీ ఎన్నికైన విషయం తెలిసిందే. అంతేకాదు పలు పదవులకు జరిగిన ఎన్నికల్లో ట్రంప్ పార్టీకి గట్టి ఎదురుదెబ్బ తగిలింది. ఈ నేపథ్యంలో అధ్యక్షుడు అప్రమత్తమయ్యారు. అమెరికాలోని ఓహియో గవర్నర్‌గా పోటీ చేయనున్న భారతీయ మూలాలు ఉన్న నాయకుడు వివేక్ రామస్వామికి తన పూర్తి మద్దతు ప్రకటించారు. ఆయన సమ్‌థింగ్ స్పెషల్ అంటూ ప్రశంసల్లో ముంచెత్తారు. వ్యాపారవేత్త నుంచి రాజకీయ నేతగా మారిన వివేక్ రామస్వామి ఓహియో రాష్ట్ర గవర్నర్‌గా అద్భుతంగా పనిచేస్తారని ట్రంప్ విశ్వాసం వ్యక్తం చేశారు. అంతేకాదు వివేక్‌కు అండగా ఉండాలని తన మద్దతుదారులకు పిలుపునిచ్చారు. ఈ మేరకు తన సోషల్ మీడియా వేదిక ట్రూత్ సోషల్‌లో ట్రంప్ పోస్టు పెట్టారు. 'నాకు వివేక్ బాగా తెలుసు. అధ్యక్ష ఎన్నికల్లో నాతో పోటీ పడ్డారు. యువకుడైన వివేక్.. చాలా స్మార్ట్. మన దేశమంటే ఆయనకు చాలా ఇష్టం' అంటూ ప్రశంసలు కురిపించారు. కాగా, ఓహియో గవర్నర్ ఎన్నికలు వచ్చే ఏడాది జరగనున్నాయి. ఇక వివేక్ రామస్వామి గతేడాది జరిగిన అధ్యక్ష ఎన్నికల్లో రిపబ్లికన్ పార్టీ తరఫున ట్రంప్‌తో పోటీ పడిన విషయం తెలిసిందే. ఆ తర్వాత పోటీ నుంచి తప్పుకున్నారు. ఇప్పుడు ఓహియో గవర్నర్‌గా పోటీ చేసేందుకు రెడీ అయ్యారు.



## సీఎం రేవంత్‌రెడ్డి బర్త్‌డే.. విష్ చేసిన పీఎం మోదీ, సీఎం దీదీ

శనివారం తెలంగాణ ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డి పుట్టిన రోజు సందర్భంగా శుభాకాంక్షలు వెల్లువెత్తుతున్నాయి. ప్రధాని నరేంద్ర మోదీ ఎక్స్ ద్వారా శుభాకాంక్షలు తెలుపుతూ, ఆయనకు ఆరోగ్యం, దీర్ఘాయుష్షు కలగాలని ఆకాంక్షించారు. అలాగే పశ్చిమ బెంగాల్ ముఖ్యమంత్రి మమతా బెనర్జీ కూడా రేవంత్‌రెడ్డికి పుట్టిన రోజు శుభాకాంక్షలు తెలిపారు. ఈ సందర్భంగా రేవంత్‌రెడ్డి తనకు శుభాకాంక్షలు తెలిపిన వారందరికీ కృతజ్ఞతలు తెలిపారు.



## బోడుప్పల్ లక్ష్మీ నగర్ కాలనీలో చోరీ...

మేడిపల్లి పోలీస్ స్టేషన్ పరిధిలోని బోడుప్పల్ లక్ష్మీ నగర్ కాలనీలో రాత్రిపూట ఇంట్లో ఎవరూ లేని సమయంలో దొంగలు చొరబడ్డారు. ఇంటి తాళం పగలగొట్టి లోపలికి ప్రవేశించిన దొంగలు, సుమారు 45 వేల రూపాయల నగదు, మూడు తులాల బంగారం, వెండి ఆభరణాలను అపహరించుకెళ్లినట్లు బాధితులు తెలిపారు. ఈ ఘటనపై మేడిపల్లి పోలీస్ స్టేషన్ లో ఫిర్యాదు చేయగా, పోలీసులు కేసు నమోదు చేసుకుని దర్యాప్తు ప్రారంభించారు. పూర్తి వివరాలు ఇంకా తెలియాల్సి ఉంది.

## దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో మహిళా దారుణ హత్య

దుండిగల్ పోలీస్ స్టేషన్ పరిధిలో శనివారం ఉదయం మహిళా దారుణ హత్యకు గురైంది .కొడిపల్లి కి చెందిన స్వాతి అనే మహిళను రాజేష్అనే వ్యక్తి గొంతుకోసి చంపివేశాడు. అనంతరం పోలీసు స్టేషన్‌లో లొంగిపోయాడు. గత కొంతకాలంగా భర్తతో దూరంగా ఉంటున్న స్వాతి రాజేష్‌తో సన్నిహితంగా ఉంటుంది.ఇద్దరి మధ్య గొడవ జరగడంతో, ఉదయం కత్తితో గొంతు కోసి దుండిగల్ పోలీస్ స్టేషన్ లో లొంగిపోయాడు. పోలీసులు ఘటనా స్థలానికి చేరుకుని పంచనామా నిర్వహించి మృతదేహాన్ని పోస్టుమార్టం కోసం ఆసు పత్రికి తరలించారు.




### నా నెలసరి గురించి అడిగేవాడు..

## లైంగిక వేధింపులపై బంగ్లా పేసర్ సంచలన ఆరోపణలు

### విచారణకు ఆదేశించిన బోర్డు

బంగ్లాదేశ్ మహిళా క్రికెట్ జట్టు సారథి నిగర్ సుల్తానాపై వ్యాఖ్యలతో వార్తల్లో నిలిచిన పేసర్ జహనారా ఆలమ్ మరోసారి సంచలన ఆరోపణలు చేసింది. బంగ్లా పురుషుల జట్టు మాజీ పేసర్ మంజురల్ ఇస్లాం తనను లైంగికంగా వేధించాడని చెప్పడంతో ఆ దేశ క్రికెట్‌లో దుమారం రేగింది. 2022లో మహిళా జట్టుకు సెలక్టర్‌గానే గాక టీమ్ మేనేజర్‌గానూ పనిచేసిన మంజురల్.. తనను నెలసరి గురించి అడిగేవాడని, పదే పదే భుజంపై చేయి వేస్తూ అభ్యంతరకరంగా ప్రవర్తించేవాడని ఆలమ్ వ్యాఖ్యానించింది. ఓ యూట్యూబ్ ఛానెల్‌కు ఇచ్చిన ఇంటర్వ్యూలో ఆలమ్ మాట్లాడుతూ.. 'ఒక్కసారి కాదు. చాలాసార్లు (లైంగిక వేధింపులపై) ఇలా జరిగింది. జట్టులో ఉన్నప్పుడు మేం వాటి గురించి బయటకు చెప్పకోలేం. ఒకవేళ ధైర్యంగా చెప్పినా అక్కడ న్యాయం జరుగదు. 2022లో న్యూజిలాండ్‌లో జరిగిన వన్డే ప్రపంచకప్ సందర్భంగా మాకు అక్కడ ప్రీక్యాంప్‌ను నిర్వహించారు. నేను బౌలింగ్ ప్రాక్టీస్ చేస్తున్నా. టీమ్ మేనేజర్‌గా ఉన్న మంజు (మంజురల్) భయ్యా నా దగ్గరకు వచ్చి.. నా చేతిని పట్టుకుని నా భుజం దగ్గర గట్టిగా నొక్కాడు. చాలామంది అమ్మాయిలతో అతడు అలాగే ప్రవర్తించేవాడు. నా చెవి దగ్గరకు వచ్చి నా పీరియడ్స్ గురించి అభ్యంతకర ప్రశ్నలు వేశాడు. అప్పుడు అతడి ప్రతిపాదన విన్నాక నాకు భయం వేసింది' అని తెలిపింది. ఈ ఆరోపణలపై మంజురల్ స్పందిస్తూ.. ఇవన్నీ నిరాధారమని అన్నాడు. ఇదిలాఉండగా ఆలమ్ ఆరోపణలపై బంగ్లాదేశ్ క్రికెట్ బోర్డు (బీసీబీ) విచారణకు ఆదేశించింది. 15 రోజుల్లో విచారణ కమిటీ తమకు నివేదికను సమర్పించాలని.. ఈ విషయంలో ప్రభుత్వ సహాయమూ తీసుకుంటామని తెలిపింది.

## హైదరాబాద్-విజయవాడ హైవేపై తగలబడిన ఇన్నోవా కారు



తెలంగాణలోని నల్గొండ జిల్లాలో ఈ ఉదయం పెను ప్రమాదం తప్పింది. వేగంగా వెళ్తున్న ఓ ఇన్నోవా కారు అదుపుతప్పి డివైడర్‌ను ఢీకొని బోల్తా పడింది. క్షణాల్లోనే కారులో మంటలు చెలరేగి పూర్తిగా దగ్ధమైంది. అయితే, అదృష్టవశాత్తు కారులో ప్రయాణిస్తున్న ఎనిమిది మంది సురక్షితంగా బయటపడటంతో అందరూ ఊపిరి పీల్చుకున్నారు. చిట్యాల మండలం గుండ్రాంపల్లి వద్ద హైదరాబాద్-విజయవాడ 65వ జాతీయ రహదారిపై ఈ ఘటన చోటుచేసుకుంది. ఓ ఇన్నోవా కారు యూటర్న్ తీసుకునే క్రమంలో అదుపుతప్పి డివైడర్‌ను బలంగా ఢీకొట్టింది. ఆ వేగానికి కారు రోడ్డుపైనే పల్టీలు కొట్టింది. వెంటనే ఇంజిన్‌లో మంటలు చెలరేగి కారు మొత్తానికి వ్యాపించాయి. ఏం జరుగుతుందో తెలుసుకునే లోపే ప్రయాణికులు అప్రమత్తమై కారులో నుంచి బయటకు దూకేశారు.సమాచారం అందుకున్న అగ్నిమాపక సిబ్బంది వెంటనే ఘటనా స్థలానికి చేరుకుని మంటలను ఆర్పివేశారు. కానీ, అప్పటికే కారు పూర్తిగా కాలి బూడిదైంది. ఈ ప్రమాదం కారణంగా జాతీయ రహదారిపై వాహనాల రాకపోకలకు తీవ్ర అంతరాయం కలిగింది. కారును రోడ్డుపై నుంచి తొలగించే వరకు భారీగా ట్రాఫిక్ జామ్ అయింది. ఈ ఘటనపై పోలీసులు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు.



## సాగర్ రెండు గేట్లు ఎత్తివేత

శుక్రవారం ఎగువ నుంచి వరద పెరగడంతో నాగార్జునసాగర్ జలాశయం నిండుకుండలా మారింది. గరిష్టస్థాయి 590 అడుగుల నీటిమట్టం చేరడంతో, రెండు రేడియల్ క్రస్ట్‌గేట్ల ద్వారా కృష్ణానదిలోకి నీటిని విడుదల చేస్తున్నారు. ఎగువ నుంచి 67,471 క్యూసెక్కుల వరద వస్తుండగా, గేట్ల ద్వారా 16,200 క్యూసెక్కులు, విద్యుదుత్పత్తి ద్వారా 34,104 క్యూసెక్కులు, మొత్తం 50,394 క్యూసెక్కుల నీటిని దిగువకు వదులుతున్నారు.

## రేవంత్‌రెడ్డిలో భయం మొదలైంది

ముఖ్యమంత్రి రేవంత్‌రెడ్డిలో భయం మొదలైందని.. జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల తర్వాత పదవీగండం పొంచి ఉందని మాజీ మంత్రి జగదీశ్‌రెడ్డి అన్నారు. తెలంగాణ భవన్‌లో ఆయన బీఆర్ఎస్ నేతలతో కలిసి మీడియా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. సీఎం మానసిక స్థితి దెబ్బతిన్నట్లుందని.. సందర్భం లేకుండా మాట్లాడుతున్నారని.. ఆయనను చూసి సిగ్గు సిగ్గుపడేలా ఉందని విమర్శించారు. నిఘా పెట్టేందుకు కేసీఆర్ కమాండ్ కంట్రోల్ కడితే.. రేవంత్ రెడ్డి కమాండ్ కంట్రోల్‌లో కూర్చొని తమపై నిఘా పెడుతున్నాడని ఆయన ప్రశ్నించారు. ప్రగతిభవన్‌లో బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు ఉంటే చూపించాలని సవాల్ విసిరారు. బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు, కమాండ్ కంట్రోల్, సెక్రటేరియట్‌పై కమీషన్ వేయవచ్చు కదా..? బుల్లెట్ ప్రూఫ్ కిటికీలు చూపిస్తావా?ప్రగతి భవన్‌ల ఎన్ని రూములున్నాయో చూపిస్తావా? అంటూ ప్రశ్నించారు.







## 15 నుంచి ఓటీటీలోకి 'కే ర్యాంప్'

టాలీవుడ్ యంగ్ హీరో కిరణ్ అబ్బవరం నటించిన తాజా రొమాంటిక్ కామెడీ ఎంటర్‌టైనర్ 'కే ర్యాంప్' ఓటీటీ విడుదలకు సిద్ధమైంది. దీపావళి కానుకగా అక్టోబర్ 18న థియేటర్లలో విడుదలైన ఈ చిత్రం, మాస్ ఆడియెన్స్‌ను ఆకట్టుకుని మంచి టాక్ సొంతం చేసుకుంది. అయితే థియేటర్‌లో మంచి విజయం అందుకున్న ఈ చిత్రం నెల రోజుల్లోపే ఓటీటీలోకి రాబోతున్నట్లు తాజాగా ప్రకటించింది. ప్రముఖ ఓటీటీ వేదిక ఆహాలో ఈ నెల 15 నుంచి స్ట్రీమింగ్ కాబోతున్నట్లు చిత్రబృందం ప్రకటించింది. కిరణ్ అబ్బవరం, యుక్తి తరేజా (హీరోయిన్‌గా) ప్రధాన పాత్రల్లో నటించిన ఈ సినిమాకు జైన్స్ నాని దర్శకత్వం వహించాడు. సాయికుమార్, నరేశ్ వి.కె., కామ్నా జెఠ్మలానీ తదితరులు కీలక పాత్రల్లో నటించారు. హాస్య మూవీస్, రుద్రాంశ్ సెల్యులాయిడ్ బ్యానర్స్‌పై రాజేశ్ దండా, శివ బొమ్మక్కు ఈ సినిమాను నిర్మించారు.



## మేఘా శుక్లా గ్లామర్ ట్రీట్

బాలీవుడ్ నటి మేఘా శుక్లా తన అందచందాలతో ఆకట్టుకొంటుంది. తన యాక్టింగ్‌తో కాకుండా సోషల్ మీడియాలో ఫోటోషూట్‌తో అలజడి సృష్టిస్తుంది. తాజాగా ఆమె చేసిన ఫోటోషూట్ ఇండస్ట్రీని షేక్ చేస్తున్నది. ఈ అందాల భామ కథల్: ఏ జాక్ ఫ్రూట్ అనే సినిమా ద్వారా మంచి పాపులారిటీ సొంతం చేసుకొన్నది. ఈ బ్యూటీ అందాలను చూసి తరించగలమా?

సూర్య www.suryaa.com EVENING EDITION 4PM



## పాన్‌కార్డ్ హోల్డర్స్‌కి కేంద్రం హెచ్చరిక

దీనివల్ల ఫ్యూచర్‌లో వారికి ఆర్థిక లావాదేవీల విషయంలో ఇబ్బందులు ఎదురయ్యే ప్రమాదం ఉంది. కేంద్ర ప్రత్యక్ష పన్నుల బోర్డు విధించిన గడువు ఇప్పటికే ముగియడంతో, లింక్ చేయని పాన్ కార్డులు నిరుపయోగంగా మారే ప్రక్రియ వేగవంతమైంది. దీనివల్ల వారి ఆర్థిక లావాదేవీలన్నీ పూర్తిగా స్తంభించిపోయే ప్రమాదం ఉంది. ఆదాయపు పన్ను చట్టం, 1961లోని సెక్షన్ 139AA ప్రకారం ప్రతి ఒక్కరూ తమ పాన్‌కార్డును ఆధార్‌తో తప్పనిసరిగా అనుసంధానం చేయాలి. పన్ను ఎగవేతలను అరికట్టడం, నకిలీ పాన్ కార్డులను ఏరివేయడం, పారదర్శకమైన ఆర్థిక వ్యవస్థను నిర్మించడం వంటి లక్ష్యాలతో ప్రభుత్వం ఈ నిబంధనను తీసుకొచ్చింది. పలుమార్లు గడువు పొడిగించినప్పటికీ, ఇంకా లక్షలాది మంది ఈ ప్రక్రియను పూర్తి చేయలేదు. గడువు ముగిసిపోవడంతో, ఇప్పుడు వీటిని లింక్ చేసుకోవాలంటే తప్పనిసరిగా రూ.1000 జరిమానా చెల్లించాల్సి ఉంటుంది. ఒకవేళ పాన్‌కార్డ్ రద్దయితే మీరు చట్ట ప్రకారం పాన్ కార్డు లేని వ్యక్తిగానే పరిగణించబడతారు. ఫలితంగా మీరు ఆదాయపు పన్ను రిటర్న్‌లను దాఖలు చేయలేరు. మీకు రావాల్సిన పన్ను రిఫండ్లు నిలిచిపోతాయి. మీ జీతం, ఫిక్స్‌డ్ డిపాజిట్లపై వడ్డీ, ఇతర ఆదాయాలపై అధిక రేటుతో టీడీఎస్ కట్ అవుతుంది. రూ.50,000 మించిన బ్యాంకింగ్ లావాదేవీలు జరపడం కష్టమవుతుంది.

### టీడీపీకి రేవంత్ రెడ్డి పిలుపు,
## అసలు పరిస్థితి చూస్తే దెబ్బతిన్నట్టు!

జూబ్లీహిల్స్ ఉప ఎన్నికల్లో సీఎం రేవంత్ రెడ్డి వ్యూహాత్మకంగా అడుగులు వేస్తున్నారు. ముఖ్యంగా సెటిలర్ ఓట్లను ఆకర్షించడానికి, ప్రత్యర్థులకు ఊహకందని విధంగా పాచికలు సిద్ధం చేస్తున్నారు.దీన్ని భాగంగా, రెండు రోజుల క్రితం ఎన్నికల ప్రచారంలో పాల్గొన్న రేవంత్ రెడ్డి, అమీర్‌పేట్‌లో టీడీపీ వ్యవస్థాపకుడు ఎన్టీఆర్ విగ్రహాన్ని స్థాపిస్తామని హామీ ఇచ్చారు. ఇది ఆంధ్రా సెటిలర్ ఓటర్లలో మంచి స్పందన సాధించింది. తాజాగా ఆయన మరో వ్యూహాత్మక అడుగు ముందుకు వేసి, టీడీపీ కార్యకర్తలకు కీలక సూచనలు చేశారు.రేవంత్ రెడ్డి ప్రశ్నించారు — టీడీపీ అధినేత నారా చంద్రబాబును అరెస్ట్ చేసిన సందర్భంలో, హైదరాబాద్‌లో పార్టీ కార్యకర్తలు నిరసన తెలిపే హక్కును మళ్లీ అడ్డుకున్న వారికి మద్దతు ఇవ్వడం ఎంత వరకూ సమంజసం? ఎవరికి అండగా నిలబడాలో, ఎవరికి ఓటు వేసాలో కార్యకర్తలే నిర్ణయించుకోవాలి అని ఆయన అభిప్రాయపడ్డారు.అంతేకాక, తెలుగు ప్రజల ఆత్మగౌరవాన్ని ప్రపంచానికి



చాటిచెప్పిన నందమూరి తారక రామారావు ఘాట్‌ను తొలగించాలని యత్నించినవారికి టీడీపీ కార్యకర్తలు మద్దతు పలకడం ఎంతవరకు న్యాయమని ఆయన సూటిగా ప్రశ్నించారు. చంద్రబాబుకు కష్టకాలంలో నిరసన ప్రకటించే అవకాశం ఇవ్వని, అలాగే ఎన్టీఆర్ ఘాట్ వంటి తెలుగు జాతి గౌరవానికి చిహ్నమైన స్థలాలను టార్గెట్ చేసిన శక్తులపై టీడీపీ కార్యకర్తలు తమ వైఖరిని పునర్విచారించుకోవాల్సిన అవసరం ఉందని రేవంత్ రెడ్డి గట్టిగా నొక్కి చెప్పారు.తెలంగాణ రాజకీయాల్లో టీడీపీ, కాంగ్రెస్ మధ్య గత విభేదాలు ఉన్నా, ప్రస్తుత పరిస్థితుల్లో తెలుగు ప్రజల ఆత్మగౌరవం, టీడీపీ స్థాపన వెనుక ఉన్న విలువలను గౌరవించే వారికి మాత్రమే మద్దతు ఇవ్వాలనే పరోక్ష సందేశాన్ని ఆయన ఇచ్చారు.


## సుప్రీంను ఆశ్రయించిన షమీ మాజీ భార్య



భారత స్టార్ పేసర్ మహ్మద్ షమీ మాజీ భార్య హసీన్ జహాన్ మరోసారి కోర్టు మెట్లెక్కింది. భరణం కింద షమీ నెలనెలా చెల్లిస్తున్న రూ. 4 లక్షలు సరిపోవడం లేదని.. వాటిని రూ. 10 లక్షలకు పెంచాలని కోరుతూ ఆమె అత్యున్నత న్యాయస్థానాన్ని ఆశ్రయించింది. 2018లో షమీ కుటుంబం తనను గృహహింసకు గురిచేస్తుందని పోలీసులను ఆశ్రయించిన విషయం తెలిసిందే. అయితే సుదీర్ఘ విచారణ తర్వాత 2023లో ట్రయల్ కోర్టు.. భరణం కింద ఆమెకు నెలకు రూ. 50 వేలు, కుమార్తె సంరక్షణ నిమిత్తం రూ. 80 వేలు చెల్లించాలని ఆదేశించింది. అయితే దీనిపై ఆమె కోల్‌కతా హైకోర్టును ఆశ్రయించగా ఆ మొత్తాన్ని రూ. 4 లక్షల(ఆమెకు రూ. 1.5 లక్షలు, కూతురుకు రూ. 2.50 లక్షలు)కు పెంచింది. తాజాగా ఆ మొత్తాన్ని రూ. 10 లక్షలకు పెంచాలని హసీన్ కోర్టుకు వెళ్లింది. దీనిపై నాలుగు వారాల్లోగా సమాధానమివ్వాలని షమీతో పాటు పశ్చిమ బెంగాల్ ప్రభుత్వానికి సుప్రీంకోర్టు నోటీసులు జారీ చేసింది.

## డిల్లీలో అధ్వానస్థితిలో వాయు కాలుష్యం.. శ్వాస తీసుకోవడంలో ప్రజల ఇబ్బందులు

దేశ రాజధాని ఢిల్లీలో వాయు కాలుష్యం కొనసాగుతోంది. గత కొన్ని రోజులుగా ఢిల్లీ-ఎన్సీఆర్‌లో గాలి నాణ్యత అధ్వాన స్థాయిలో నమోదవుతోన్న విషయం తెలిసిందే. తాజాగా శనివారం ఉదయం కూడా ఢిల్లీలో కాలుష్యం వెరీ పూర్ కేటరిగీలో నమోదైంది.సెంట్రల్ పొల్యూషన్ కంట్రోల్ బోర్డు ప్రకారం.. శనివారం ఉదయం ఢిల్లీలో ఎయిర్ క్వాలిటీ ఇండెక్స్ (AQI) 355గా నమోదైంది. ఆనంద్ విహార్‌లో ఏక్యూఐ 332గా, అలీపూర్ వద్ద 316, అశోక్ విహార్‌లో 332, ఇండిగా గేట్ వద్ద ఏక్యూ 322గా, పాలెం ప్రాంతంలో 320, ధౌలా కువాన్‌లో 269, అశోక్ విహార్ ప్రాంతంలో 332, బవానాలో 366, బురారి క్రాసింగ్ వద్ద 345, ఛాందిని చౌక్ ప్రాంతంలో 354, ద్వారకా సెక్టార్-8లో 310, ఐటీఓ ప్రాంతంలో 337, జహంగీర్‌పురిలో 342, ముండ్కా ప్రాంతంలో 335, నరేలా వద్ద 335, ఓఖ్లా ఫేజ్-2లో 307, పట్పర్‌గంజ్ వద్ద 314, పంజాబీ బాగ్ 343, ఆర్‌కే పురంలో 321, రోహిణి ప్రాంతంలో 336, సోనియా విహార్ వద్ద 326గా ఏక్యూఐ వెరీ పూర్ కేటగిరీలో నమోదైంది.





## జాతీయ రహదారిపై పెళ్లి కారు బీభత్సం.. ముగ్గురు మృతి, ఏడుగురికి సీరియస్

కాకినాడ జిల్లా కిర్లంపూడి మండలం సోమవారం దగ్గర ఘోర రోడ్డు ప్రమాదం జరిగింది. జాతీయ రహదారిపై కారు బీభత్సం సృష్టించింది. బస్సు కోసం వేచి ఉన్న ప్రయాణికులపై కారు వేగంగా దూసుకెళ్లింది. దీంతో రెండు బైకులు, ఒక రిక్షా పూర్తిగా ధ్వంసమయ్యాయి. ఈ ఘటనలో ముగ్గురు వ్యక్తులు ప్రాణాలు కోల్పోగా, ఏడుగురికి తీవ్ర గాయాలయ్యాయి. అన్నవరం నుంచి జగ్గంపేటకు వెళ్తున్న పెళ్లికారు ఫ్రంట్ టైర్ పేలిపోవడంతో ఈ ప్రమాదం చోటుచేసుకుందని పోలీసులు తెలిపారు. హుటాహుటిన సంఘటనాస్థలానికి చేరుకున్న పోలీసులు సహాయకచర్యలు చేపట్టారు. జగ్గంపేట ఎమ్మెల్యే జ్యోతుల నెహ్రూ ఘటనాస్థలానికి చేరుకు ప్రమాదంపై ఆరాతీశారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించారు అధికారులను కోరారు.

**కారు టైర్ పేలడంతో బీభత్సం..**

కాగా అన్నవరం వద్ద జరిగిన పెళ్లి కార్యక్రమం ముగించుకుని జగ్గంపేటకు తిరిగి వెళ్తుండగా.. ఇన్నోవా కారుకు ఫ్రంట్ టైర్ అకస్మాత్తుగా పేలిపోయింది. దాంతో కారు బస్సు షెల్టర్ దగ్గర బస్సు కోసం వేచి ఉన్న విద్యార్థులు, ప్రయాణికులపై దూసుకెళ్లింది. ఈ ఘటనలో ముగ్గురు అక్కడికక్కడే మృతి చెందారు.

### నాలుగు వందే భారత్ రైళ్లను
## జాతికి అంకితం చేసిన ప్రధాని



ప్రధాని నరేంద్ర మోదీ శనివారం నాలుగు వందే భారత్ రైళ్లను ప్రారంభించారు. వారణాసి రైల్వేస్టేషన్‌లో జరిగిన కార్యక్రమంలో పాల్గొన్న ప్రధాని.. సెమీ హైస్పీడ్ రైళ్లను జాతికి అంకితం చేశారు. మూడు రైళ్లను వీడియోకాన్ఫరెన్స్ ద్వారా ప్రారంభించారు. కొత్త రైళ్లు లక్నో-సహరన్‌పూర్, ఫిరోజ్‌పూర్-ఢిల్లీ, వారణాసి-ఖజురహో, బెంగళూరు-ఎర్నాకుళం మధ్య రాకపోకలు సాగించనున్నాయి. ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన కార్యక్రమంలో ప్రధాని మాట్లాడుతూ.. అందరికీ ప్రత్యేక అనుభవాన్ని అందించడమే తమ ప్రభుత్వ ప్రయత్నంగా పేరొన్నారు. కాశీలో ఆరోగ్య సేవలు నిరంతరం పెరుగుతున్నాయన్నారు. పది పదకొండేళ్ల కిందట ఏదైనా ఆరోగ్య సమస్యలు వస్తే చికిత్స పొందడం కష్టంగా ఉండేదని.. ప్రజలకు ఒకే ఒక ఆప్షన్ ఉండేది అదే బీహెచ్‌యూ మాత్రమేనన్నారు. రాత్రంతా నిలబడినా బెడ్ పొందలేకపోయారని.. క్యాన్సర్ వంటి తీవ్రమైన సమస్య వచ్చినా చికిత్స పొందేందుకు ఇబ్బందులుపడేవారన్నారు. కాశీ ప్రజల సమస్యలను పరిష్కరించేందుకు తమ ప్రభుత్వం మహామన క్యాన్సర్ ఆసుపత్రితో సహా అనేక ఆసుపత్రులు నిర్మించిందన్నారు. భారత్‌ల శతాబ్దాలుగా తీర్థయాత్రను దేశ చైతన్యానికి మాధ్యమంగా పిలుస్తున్నారని ప్రధాని పేర్కొన్నారు. ఈ తీర్థయాత్రలు కేవలం దేవుని దర్శనానికి మార్గం మాత్రమే కాదని.. భారతదేశ ఆత్మను కలిపే పవిత్ర సంప్రదాయమన్నారు.



## హాట్ మిల్కీ బ్యూటీ

మిల్కీ బ్యూటీ తమన్నా గురించి ప్రత్యేకమైన పరిచయం అవసరం లేదు. తెలుగులో దాదాపు అందరు స్టార్ హీరోలతో నటించి స్టార్ హీరోయిన్ గా గుర్తింపు తెచ్చుకుంది. అయితే, ఈ మధ్య సినిమా అవకాశాలు తగ్గడంతో బాలీవుడ్ ఐటెం సాంగ్స్ చేస్తూ బిజీగా ఉంది ఈ బ్యూటీ. ఇదిలా ఉంటే, తాజాగా తన సినిమా జీవితం గురించి ఆసక్తికర కామెంట్స్ చేసింది. తనకు ఈ గుర్తింపు సినిమాల వల్ల రాలేదట. కేవలం ఐటమ్స్ సాంగ్స్ వల్లనే ఫేమస్ అయ్యాను అంటూ చెప్పుకొచ్చింది. అయితే, తమన్నా చేసిన ఈ కామెంట్స్ కి ఆమె ఫ్యాన్స్ అవాక్కవుతున్నారు. అదేంటి తమన్నా అంతమాట అన్నావ్. మేమంతా నిన్ను మా హీరోయిన్ గా ఆరాధిస్తుంటే.. నువ్వేమో ఐటెం సాంగ్స్ వల్ల క్రేజ్ వచ్చింది అంటావ్ ఏంటి అంటూ కామెంట్స్ చేస్తున్నారు.





## చేపల ఉత్పత్తి పెంపునకు కదలిక..

### ఖమ్మంలో పంపిణీ కేంద్రాన్ని పరిశీలించిన కలెక్టర్ డా. శ్రీజ

జిల్లాలో మత్స్య సంపదను, ఉత్పత్తిని పెంచేందుకు చేపట్టిన ఉచిత చేప పిల్లల పంపిణీ కార్యక్రమం పకడ్బందీగా అమలు జరిగేలా చర్యలు తీసుకోవాలని ఖమ్మం జిల్లా ఇంచార్జ్ కలెక్టర్ డాక్టర్ పి. శ్రీజ అధికారులను ఆదేశించారు. ఖమ్మం రూరల్ మండల కేంద్రంలో ఏర్పాటు చేసిన చేప పిల్లల డిస్ట్రిబ్యూషన్ పాయింట్‌ను శుక్రవారం ఆమె ఆకస్మికంగా సందర్శించి, పంపిణీ ప్రక్రియ తీరును క్షుణ్ణంగా పరిశీలించారు. నిర్దేశించిన లక్ష్యం మేరకు, జిల్లాలోని జలాశయాలు, చెరువుల్లో చేప పిల్లల విడుదల ప్రక్రియను ఈ నెలాఖరులోగా వంద శాతం పూర్తి చేయాలని సంబంధిత అధికారులకు ఆమె స్పష్టమైన ఆదేశాలు జారీ చేశారు. మత్స్యకారుల ఆదాయాన్ని పెంచడం, స్థానిక మార్కెట్లలో చేపల లభ్యతను మెరుగుపరచడం ఈ ప్రభుత్వ కార్యక్రమం ముఖ్య ఉద్దేశం. ఈ నేపథ్యంలో, సరైన నాణ్యత, సంఖ్యలో చేప పిల్లలను పంపిణీ చేయడం అత్యవసరం. ఖమ్మం రూరల్ మండలంలోని ఆరెంపుల, బారుగూడెం నల్లచెరువుల్లో చేప పిల్లలను స్వయంగా విడుదల చేసిన కలెక్టర్ డా. శ్రీజ, పంపిణీలో ఎలాంటి లోటుపాట్లకు తావు లేకుండా చూడాలని సూచించారు. చేప పిల్లల రవాణా, వాటిని నీటి వనరుల్లో విడుదల చేసే సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తలపై ఆమె అధికారులకు దిశానిర్దేశం చేశారు. ఈ కీలకమైన పంపిణీ కార్యక్రమం విజయవంతం కావాలంటే మండల స్థాయిలో ఏర్పాటైన కమిటీల పాత్ర చాలా ముఖ్యమని కలెక్టర్ నొక్కి చెప్పారు. ఈ కమిటీలు పారదర్శకంగా, సక్రమంగా పనిచేయడం ద్వారానే, ప్రభుత్వ లక్ష్యం నెరవేరుతుందని ఆమె పేర్కొన్నారు. అర్హులైన ప్రతి మత్స్య సహకార సంఘానికి, వారి పరిధిలోని నీటి వనరులకు కేటాయించిన మేరకు చేప పిల్లలు సకాలంలో అందేలా కమిటీలు చొరవ చూపాలి. పంపిణీ ప్రక్రియలో ఎక్కడా జాప్యం జరగకుండా, రికార్డులను పక్కాగా నిర్వహించాలని ఆమె స్పష్టం చేశారు.

## మాలిలో ఐదుగురు భారతీయులు కిడ్నాప్

పశ్చిమ ఆఫ్రికా దేశం మాలిలో ఐదుగురు భారతీయులు కిడ్నాప్‌కు గురయ్యారు. పశ్చిమ మాలిలోని కోబ్రి పట్టణ సమీపంలో గురువారం ఈ ఘటన జరిగినట్లు అక్కడి భద్రతా వర్గాలు శుక్రవారం వెల్లడించాయి. ఆఫ్రికన్ దేశం ప్రస్తుతం అల్ ఖైదా, ఐసిస్ తిరుగుబాటును ఎదుర్కొంటోంది. ఈ తరుణంలో భారతీయుల కిడ్నాప్ తీవ్ర ఆందోళన కలిగిస్తోంది. వివరాల్లోకి వెళితే.. కిడ్నాప్‌కు గురైన బాధితులు ఓ విద్యుదీకరణ ప్రాజెక్టులో కార్మికులుగా పనిచేస్తున్నారు. ఆయుధాలతో వచ్చిన కొందరు దుండగులు వారిని బలవంతంగా లాక్కెళ్లిపోయారు. ఈ ఘటనతో అప్రమత్తమైన యాజమాన్యం కంపెనీలో పనిచేస్తున్న మిగతా భారతీయులను ముందుజాగ్రత్త చర్యగా సురక్షిత ప్రాంతానికి తరలించినట్లు కంపెనీ ప్రతినిధి ఒకరు తెలిపారు.